క్లుప్తంగా

పోలీస్ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్, గజ్వాడ, టి.లింగంపల్లి, సిందోల్ గ్రామాల్లో మంగళవారం పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సంఘ విద్రోహక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అల్లాదుర్గం సీఐ జార్జి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజయ్య, సిబ్బంది ఉన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

పెద్దశంకరంపేట(మెదక్): ఓటుహక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, పెద్దలు ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

పెద్దశంకరంపేట(మెదక్): ఆధార్ అప్‌డేట్స్ కోసం గడువు లేదని మీసేవా కేంద్రాల జిల్లా మేనేజర్ శశికాంత్ తెలిపారు. మంగళవారం పెద్దశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఆధార్ సెంటర్లలో 20 నుంచి 40 వరకు మాత్రమే ఆధార్ అప్‌డేట్స్ అవుతున్నాయన్నారు. సర్వర్ సమస్య, వేలిముద్రలు, ఐరిస్ తొందరగా రాకపోవడం వల్ల ఎక్కువగా అప్‌డేట్ కావడం లేదన్నారు. ఆధార్ అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని దీనికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఎంతో మంది ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్‌సెంటర్ల వద్దకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారని, సమయం ఉన్నప్పుడు ఎప్పుడైనా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

యువకులు రక్తదానంలో ముందుండాలి



రక్తదానం చేస్తున్న సీఐ జార్జ్, ఎస్ఐలు

పెద్దశంకరంపేట(మెదక్): యువకులు రక్తదానంలో ముందుండాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం యువకులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, టేక్మాల్ ఎస్ఐ రమేశ్, ఏఎస్ఐ విఠల్, సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం మొక్కలను రక్షించండి



మొక్కలకు నీళ్లు పట్టడాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను రక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రాయిలాపూర్, నాగ్సాన్‌పల్లి తదితర గ్రామాల్లో జాతీయ రహదారి వెంట నాటిన హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను రక్షించాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పెట్టాలన్నారు. ఎక్కడైన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్త వాటిని పెట్టి రక్షించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీం పాల్గొన్నారు.

కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



ఇంటింటి ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ప్రజాప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత కోరారు. మంగళవారం మండలంలోని లింగారెడ్డిపేట్‌లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు భూపతిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు కేసీఆర్ చేసిన సేవలు, పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సుగుణ, నాయకులు పెంటాగౌడ్, జావీద్ పాషా, ఇర్ఫాన్, రాహుల్, నరేస్, అనిల్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, ఉప సర్పంచ్‌లు నవీన్‌చారి, ధర్మేందర్, వెంకటేశ్, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మూడో సారి ఆయన్ను గెలిపిస్తాయని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు ఏశం నాగరాజు యాదవ్, యువకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల నాయకులకు డిపాజిట్ దక్కటం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, బాబు, భాస్కర్, భరత్, ఆంజనేయులు తదితరులున్నారు.

వైఎస్సార్ పథకాలు ప్రజల గుండెల్లో పదిలం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్



వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ప్రజల గుండెల్లో ఇంకా పదిలంగా ఉన్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేశ్ తెలిపారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇల్లు, స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్యశ్రీ, 108 వంటి ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు మజహర్, నాయకులు కిషోర్, పాపయ్య, సేవ్యానాయక్, చంద్రమోహన్‌రెడ్డి, సాయిలు, సోమన్న, ప్రవీణ్, సంతోష్, శేషుగౌడ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ వైపు ప్రజల చూపు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూపల్లి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. గ్యారెంటీ పథకాలు కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని అన్నారు. అనంతరం కాళ్లకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కర్రె మహేశ్, వెంకటేశ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గోపాల్, నర్సింహచారి, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, గానుగు వెంకటేశ్, నాగరాజుగౌడ్, కృష్ణ, రాంచందర్, ప్రభాకర్‌గౌడ్, రమేశ్, రంగాచారి, వెంకటేశ్, రామస్వామి, అమరేందర్, అన్వర్ అశోక్ తదితరులు ఉన్నారు.

బీజేపీని విమర్శిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి విషయంలో చేగుంట నార్సింగి మండలాల బీఆర్ఎస్ నాయకులు బీజేపీపై తప్పుడు ప్రచారం మానుకోకుంటే ఊరుకునేది లేదని మాజీ ఎంపీపీ కర్ణపాండు అన్నారు. చేగుంటలో బీజేపీ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ దాడి చేసినట్లు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చెబుతుంటే.. ఇక్కడి నాయకులు రఘునందన్ రావుపై విమర్శలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బీఆర్ఎస్ నాయకులకు రస్తారోకో చేసేందుకు మంగళవారం చేగుంట బంద్‌కు పోలీసులు అనుమతులు ఎలా ఇచ్చారో చెప్పాలన్నారు. బీజేపీ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్న చేగుంట నార్సింగి బీఆర్ఎస్ నాయకులపై పరువు నష్టం దావా వేస్తామన్నారు. ఎన్నికల సమయం ఉన్నందున ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తీరు మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మండల అధ్యక్షుడు భూపాల్, బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్, రవికుమార్, బాలచందర్, రఘువీర్, గ్రామాల బీజేపీ నాయకులు ఉన్నారు.

గజ్వేల్‌లో ఈటల విజయం ఖాయం

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో ఈటలదే విజయమని మండల బీజేపీ సమన్వయ కర్త వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం, తూప్రాన్‌లోని ఘనపూర్ పరిధిలోని దమ్మక్కపల్లిలో మండల బీజేపీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈటల రాకతో గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరుతున్నారని, ప్రజలు ఈటలకు ఓటు వేస్తామంటున్నారని తెలిపారు. ఉపసర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ప్రేమలత, మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో వారు మండల పరిధిలోని అంతారం, సామ్లాతండా, శీలాంపల్లి, అజ్జమర్రి, గంగారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సీసీలు, రైతులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై కళాజాత

రామాయంపేట(మెదక్): ప్రతీ వ్యక్తి ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిస్తూ మంగళవారం రామాయంపేటలో కళాకారులు కళాజాత నిర్వహించారు. మెదక్ రోడ్డులో, బస్టాండ్ వద్ద, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఈమేరకు ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ మంగళవారం చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో పూజలు చేసి, మొక్కులు చెల్లించున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ తదితరులు ఉన్నారు.

టికెట్ కోసం కిషన్‌రెడ్డిని కలిసిన అశ్విని



రామాయంపేట(మెదక్): మెదక్ నుంచి బీజేపీ తరఫున టికెట్ తనకే కేటాయించాలని పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోచమ్మల అశ్విని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. మంగళవారం ఆమె కొందరు కార్యకర్తలతో కలిసి కిషన్‌రెడ్డిని కలిశారు. టికెట్ కేటాయింపు విషయమై కిషన్‌రెడ్డి తమకు హామీఇచ్చారని అశ్విని పేర్కొన్నారు.

సునీతారెడ్డి గెలుపునకు కృషి చేయండి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): సునీతారెడ్డి గెలుపుకు కృషి చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని పర్కిబండ గ్రామంలో సర్పంచ్ పూల అర్జున్, మాజీ జెడ్పీటీసీ నారాయణగౌడ్ గ్రామ ముఖ్య కార్యకర్తలను ఎమ్మెల్యే, సునీతారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ గెలుపుకు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ హరికృష్ణ, సర్పంచ్‌లు అర్జున్, వెంకటేశ్వర్లు, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్, నాయకులు శ్రీరాం, కోమరెల్లి, కాయితయ్య, గణేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దంతన్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర లెబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, దుర్గం రమేశ్, మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



టేక్మాల్(మెదక్): దనూరలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): రన్నింగ్ చేస్తున్న విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు



చిన్నశంకరంపేటలో ..

ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం హేయం



నార్సింగి మజీద్‌లో ప్రార్థనలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



చేగుంట(తూప్రాన్): పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాపన్నపేట(మెదక్): దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం హేయమైన చర్య అని పాపన్నపేట మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు శేష శైనారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో హింసకు తావుండరాదని అన్నారు. నిందితుడిపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వెల్దుర్తి(తూప్రాన్): కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ దిష్టిబొమ్మలు దహనం చేశారు.

చేగుంట(తూప్రాన్): కొత్త ప్రభాకర్‌రెడ్డి దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిర్వహించిన చేగుంట బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నాయకులు వ్యాపార సంస్థలను మూసేసి ప్రభాకర్‌రెడ్డికి అనుకూల నినాదాలు చేశారు. అనంతరం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కోలుకోవాలని పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నార్సింగి బంద్

రామాయంపేట(మెదక్): ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల మూసివేయించారు. ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇందిరాగాంధీకి నివాళులు

నర్సాపూర్: మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను వారు గుర్తు చేశారు.

◆ నిర్భయంగా ఓటు వేయండి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ.బాలరాజు తదితరులున్నారు.

◆ వడ్లకుప్ప తగిలి ఆటో బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్): ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి రహదారిపై వేసిన వడ్లకుప్పకు తగిలి ఆటో బోల్తాపడిన సంఘటన మండలంలోని మిర్జాపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. మంగళవారం మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి శంకర్ ఆటో తీసుకొని నార్సింగి నుంచి మిర్జాపల్లి వైపు వస్తున్నాడు. ఇదే సమయంలో ఎదురుగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎదురుగా వస్తుండడంతో ఆటో పక్కకు జరిపాడు. దీంతో రహదారిపై పోసిన వడ్ల కుప్పపైకి ఆటోవెళ్లి అదుపు తప్పింది. దీంతో ఆటో బోల్తాపడగా డ్రైవింగ్ చేస్తున్న శంకర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని డాక్యా తండాలో మంగళవారం చోటు చేసుకున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన డేగావత్ విఠల్ (29)వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ విషయమై భార్యతో తరచుగా గొడవలు జరిగేవి. దీంతో కలత చెందిన విఠల్ సోమవారం తండా శివారులోని డంప్‌యార్డు వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ.. మంగళవారం మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

◆ హనుమాన్ దేవాలయంలో మండల పూజ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం మండల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభావతి, నర్సింలు, మండల బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ దంపతులు, పండితులు రాము పంతులు ఆధ్వర్యంలో హోమం చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని వడియారం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ తావూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన బక్కొల్ల అంజయ్య(55) హమాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఆర్థిక ఇబ్బందులతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అంజయ్య రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

◆ రెండు బైకులు ఢీ కొని ముగ్గురికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తా సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హమ్మద్‌గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన పోతంశెట్టిపల్లికి చెందిన గాండ్ల వెంకటేశ్, చిన్నఘనాపూర్‌కు చెందిన గిరిగల్ల శ్రవణ్ కుమార్ బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన దుబ్బగల కృష్ణ మెదక్ నుంచి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. పోతంశెట్టిపల్లి శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న బైకును అదుపుతప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి చేయి విరగగా, శ్రవణ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

◆ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ జిల్లా విజయవాడ అర్బన్, లంబాడిపేట్‌లోని చిట్టానగర్‌కు చెందిన కొమర సాయిచరణ్ (23) ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సర్వే స్మార్ట్ పొలిటికల్ అండ్ రీసెర్చ్ ఎనాలిసిస్ డెటా కలెక్టర్‌గా పనులు చేయడానికి సంగారెడ్డికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం మేడ్చల్ నుంచి సంగారెడ్డికి తోటి ఉద్యోగితో కలిసి స్కూటీపై వెళ్తున్నాడు. కాగా మనోహరాబాద్ సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న వరికుప్పపై నుంచి స్కూటిని నడపడంతో అదుపు తప్పి కిందపడి పోయారు. ఈ క్రమంలో సాయిచరణ్ తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ జెడ్పీ స్థాయీసంఘ సమావేశాల వాయిదా

మెదక్ కలెక్టరేట్: కోరం లేకపోవడంతో రెండో రోజు మంగళవారం జరగాల్సిన జెడ్పీస్థాయి సంఘ సమావేశాలు వాయిదా పడ్డాయి. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, ప్లానింగ్, పనులకు సంబంధించిన సమావేశాలకు జెడ్పీచైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ హాజరుకాగా ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు జెడ్పీసీఈఓ వెంకటశైలేష్ తెలిపారు.

◆ విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం రాజిపేట సమీపంలోని పొలాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన సిలంబరసన్(32) మరో ఇద్దరితో కలిసి హార్వెస్టర్ మిషన్‌తో రాజిపేటలో వరి కోత పనులు చేసేందుకు వచ్చారు. గ్రామ సమీపంలో పనులు చేస్తున్న క్రమంలో హార్వెస్టర్ చెడిపోయింది. దానికి వెల్డింగ్ చేయడానికి సమీపంలోని కరెంట్ స్తంభం నుంచి వైర్ లాగారు. విద్యుత్ సరఫరా కావడం లేదని పరిశీలించేందుకు వెళ్లిన సిలంబరసన్ విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. అతన్ని చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. మృతుని తమ్ముడు మణికందన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ట్రాక్టర్ అపహరణకు యత్నం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకున్నారు. శివ్వంపేటలోని ధనలక్ష్మి ఆలయం సమీపంలో నిలిపి ఉన్న ట్రాక్టర్ ఇంజన్‌తో పాటు ట్రాలీని ఓ వ్యక్తి చోరీ చేస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

నర్సాపూర్: ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని భీమ్లా తండా సర్పంచ్ చెన్యానాయక్, ఆయా పార్టీల నాయకులు రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.